క్లుప్తంగా

పంట కాలువలో మృతదేహం

గురజాల రూరల్ : పంట కాలువలో మృత దేహం లభ్యమైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని గోగులపాడు సమీపంలో గల రామాపురం మేజర్ కాలువ నందు గోనె సంచిలో కట్టిన వ్యక్తి శవం దర్శన మిచ్చింది. అటుగా వెళ్తున్న రైతులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు విచారణలో తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా దోనపాముల గ్రామానికి చెందిన షేక్ షరీఫ్(40)గా నిర్ధారించినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

విజయపురిసౌత్: సనాతన ధర్మాన్ని కాపాడుకో వాల్సిన బాధ్యత ప్రతి ఒక్క హిందువుపై ఉం దని మద్దిమడుగు హనుమాన్ దీక్ష గురుపీఠం కె.జయరామ్ గురుస్వామి అన్నారు. బుధవారం విజయపురిసౌత్‌లోని డౌన్ మార్కెట్ వద్ద ఆంజనేయస్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గురుస్వామి మాట్లాడుతూ 1992 సంవత్సరంలో మొట్టమొదటి సారిగా 12 మందితో మద్దిమడుగులో ఆంజనేయ స్వామి మాల ధరించినట్లు పేర్కొన్నారు. అంచలంచలుగా ఇప్పటికి సంవత్సరానికి సుమారు 2 లక్షల మంది భక్తులు స్వామిమాలను ధరిస్తున్నట్లు తెలిపారు. మద్దిమడుగు ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద భక్తుల సౌకర్యార్థం నూతనంగా ఎకరం స్థలంలో సత్రాన్ని ఏర్పాటు చేయడానికి సంకల్పించామన్నారు. ఆంజనేయ స్వామి భక్తులు ఈశ్వర్ జి.తాతారావు, కొర్లయ్య, భూలోక తదితరులు పాల్గొన్నారు.

నశీర్ అహ్మద్‌కు సాహితీ పురస్కారం ప్రదానం



పిడుగురాళ్ల: హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రకటించిన సాహితీ పురస్కారాన్ని పిడుగురాళ్ల పట్టణానికి చెందిన ప్రముఖ చరిత్ర కారుడు సయ్యద్ నశీర్ అహ్మద్‌కు మంగళవారం రాత్రి స్వీకరించారు. తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య వెలుదండ నిత్యానంద రావు అధ్యక్షత డాక్టర్ నందమూరి తారకరామారావు కళామందిరంలో పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో సయ్యద్ నశీర్ అహ్మద్ ఆజాద్ రాసిన హింద్ ఫౌజ్ ముస్లిం పోరాట యోధుల గ్రంథానికి సాహితీ పురస్కారం లభించింది. ఈ గ్రంథాన్ని ఎంపిక చేసిన పలు గ్రంథాలయాలకు, ఆసక్తిగల పాఠకులకు అవార్డు అంకితం ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ మాజీ సలహాదారు కేవీ రమణాచారి ముఖ్యఅతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో ఆచార్య వైవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాలధారణం.. నియమాల తోరణం

- ఆధ్యాత్మికత, ఆరోగ్య సూత్రాల మేలు కలయిక అయ్యప్ప దీక్ష
- గురజాల మండలంలో దీక్షపై ఆసక్తి చూపుతున్న యువత
- దీక్షానంతరం సైతం ప్రవర్తనలో మార్పు వస్తుందంటున్న గురుస్వాములు



గురజాలలో సద్ది స్వీకరిస్తున్న అయ్యప్ప మాలధారులు

గురజాల: కార్తిక మాసంలో వివిధ మాల ధారులతో ఎటుచూసినా ఆధ్యాత్మి శోభ తాండవిస్తుంది. శివకేశవుల తనయుడైన మణికంఠుడి మాలధారణ ఎంతో నియమ నిష్ఠలతో కూడుకున్నదని గురుస్వాములు చెబుతారు. శరీరాన్ని, మనసును చెడు నుంచి మంచి మార్గంలోకి మళ్లించే అయ్యప్ప దీక్షను అత్యంత భక్తిశ్రద్ధలతో పాటిస్తారు. సన్మార్గాన జీవనయాత్ర సాగించాలనుకునే హిందువులు తప్పనిసరిగా జీవితంలో ఒకసారైనా శబరిమల యాత్రను చేపట్టాలని కోరుకుంటారు. ఆధ్యాత్మికత, ఆరోగ్య సూత్రాలను మేళవింప చేసేది అయ్యప్ప దీక్ష. స్వామివారి దర్శనం కంటే ముందు 18 మెట్లు అధిరోహించడం ద్వారా అజ్ఞానం వీడి స్వామివారి అనుగ్రహం లభిస్తుందని దీక్షాపరుల ప్రగాఢ నమ్మకం. గురజాల మండలంలో ప్రతి సంవత్సరం దీక్ష తీసుకునే యువకుల సంఖ్య గణనీయంగా పెరుగుతుండడం విశేషం.

నియమ నిబంధనలు ఇలా...

అయ్యప్ప మాల ఆలయంలో గురుస్వామి వద్ద లేదా ఇంటిలో మాతృమూర్తి వద్ద స్వీకరించొచ్చు. ప్రతిరోజు సూర్యోదయానికి ముందు స్నానమాచరించి పూజలు చేసుకోవాలి. సూర్యాస్తమయం తరువాత పూజలు నిర్వహించాల్సి వుంటుంది. నల్లటి దుస్తులు ధరించి 41 రోజుల పాటు కఠిన నియమాలు పాటించాలి. రాత్రిళ్లు ఆలయాల్లో నిద్రపోవడం శ్రేయస్కరం.

అంతా ఆధ్యాత్మికమే...

అయ్యప్ప మాల దీక్ష అంతా ఆధ్యాత్మిక పారవశ్యమే. దీక్ష చేపట్టిన నాటి నుంచి విరమించేవరకు స్వాములు స్వామి వారి ధ్యానంలోనే ఉంటారు. ప్రతి ఒక్కరినీ స్వామి అంటూ.. మాతా అంటూ పిలుస్తుంటారు. శబరిమల యాత్ర ఆద్యంతం భక్తి పారవశ్యం. దీక్ష ముగించేందుకు శబరిమల బయలుదేరి పంబానదిలో స్వాములు స్నానమాచరించి సన్నిధానంకు ఇరుముడులు మోసుకుంటూ స్వామియే శరణమయ్యప్ప అంటూ కొండ అంచున ఉన్న దేవాలయానికి చేరుకుంటారు.

ఆరోగ్య ప్రయోజనాలు..

స్వాములు పాటించే 41 రోజుల దీక్ష ఆరోగ్యం మెరుగుపరచేందుకు సైతం దోహదపడుతుంది. భక్తిభావంతో పాటు ఆహార అలవాట్లలో కూడా మార్పు వస్తుంది. వేకువజామునే నిద్ర లేవడం, చన్నీటి స్నానమాచరించడంతో నాడీ వ్యవస్థ ఉత్తేజమవుతుంది. నేల మీద పడుకోవడం కండరాల పటిష్టతకు రక్తప్రసరణ మెరుగునకు దోహదపడుతుంది. నిత్య దీపారధన చేయడం వలన మనసు తేలికపడి స్నేహం, ప్రేమానురాగాలు పెరుగుతాయి. కార్తిక మాసం మొదటి రోజు నుంచి మకర సంక్రాంతి వరకు భజనలు చేస్తూ స్వామి వారి కృపకు పాత్రులవుతారు.

ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది



మాల ధారణ వలన ఆధ్యాత్మిక చింతన పెరిగి, భగవన్నామ స్మరణలో నిమగ్నమవుతారు. 41 రోజుల దీక్ష అనంతరం వారిలో కొంతమేరకు మార్పు వస్తుంది. మానవతా విలువలు పెరుగుతాయి. దైవారాధనతో జీవితం సాఫల్యం అవుతుంది. పాపాలు తొలగిపోయి సన్మార్గంలో నడిచేందుకు అవకాశాలుంటాయని నమ్మకం. దీక్షానంతరం సైతం చాలమంది ప్రవర్తనలో మార్పు కలుగుతుంది.

– ఎస్ఎస్ఆర్‌పి సూరి, గురుస్వామి

ఇంటి పన్ను వసూళ్లలో పిడుగురాళ్ల మూడోస్థానం

మున్సిపల్ ఆర్‌డీ హరికృష్ణ



మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ అడ్మిన్లతో మాట్లాడుతున్న మున్సిపల్ ఆర్‌డీ హరికృష్ణ

పిడుగురాళ్ల: గుంటూరు డివిజన్‌లో పిడుగురాళ్ల మున్సిపాలిటీ ఇంటి పన్ను వసూళ్లల్లో మూడో స్థానంలో నిలిచిందని మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ హరికృష్ణ అన్నారు. పట్టణంలోని డపింగ్ యార్డులో గ్యాస్ ఉత్పత్తి కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ అడ్మిన్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వ్యర్థాలతో ఆదాయాన్ని పెంపొందించే కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం పన్నులు వసూళ్లు చేయాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ఈ క్రమంలోనే ఇంటి పన్ను వసూళ్లల్లో పిడుగురాళ్ల మున్సిపాలిటీ మూడవ స్థానంలో ఉందని, పూర్తిస్థాయిలో వసూళ్లు చేసి మొదటి స్థానంలో నిలవాలని సిబ్బందికి సూచించారు. అలాగే నీటి పన్ను వసూళ్లపై కూడా ప్రత్యేక దృష్టిపెట్టి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. శాఖాపరమైన పలు సూచనలు, సలహాలను అందించారు. మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్, ఆర్వో మోహిదీన్, ఆర్ఐ, సచివాలయ అడ్మిన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'



జెట్టిపాలెంలో రైతులకు సూచనలు చేస్తున్న ఏఓ బ్రహ్మారెడ్డి

రెంటచింతల: సస్యరక్షణ ద్వారానే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని జెట్టిపాలెం, మల్లవరం గ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా ఆయన రైతులకు పంటల సాగులో తీసుకోవాల్సిన మెలకువలు వివరించారు. సేంద్రీయ ఎరువులు వేయడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. వేసవిలో రెండుసార్లు లోతు దుక్కులు దున్ని ఎకరాకు 4 టన్నుల పశువుల ఎరువును దుక్కిలో వేయాలన్నారు. అజొల్లా, నీలి ఆకు, పచ్చనాచు, అజోస్పైరిల్లమ్ లాంటి జీవన ఎరువులను పంటలకు ఎక్కువగా వినియోగించుకోవాలన్నారు. విత్తన శుద్ధి చేయడం వలన, వ్యవసాయ అధికారుల సూచనల మేరకు నత్రజని, భాస్వరం, పొటాష్, ఎరువులను వేసుకోవడం వలన తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులను సాధించడం జరుగుతుందన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

అదృశ్యమైన యువకుడి మృతదేహం లభ్యం



మృతుడు అఖిల్‌కుమార్(ఫైల్)

రెంటచింతల: ఉద్యోగం కోసం దళారులకు ఇచ్చిన నగదు వెనక్కి ఇవ్వకపోవడం, ఉద్యోగం రాకపోవడంతో మనస్థాపం చెందిన మండలంలోని రెంటాల గ్రామానికి చెందిన కొత్త అఖిల్‌కుమార్ (26) సోమవారం అదృశ్యమై ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు బుధవారం తెలిపారు. అఖిల్‌కుమార్ నాలుగేళ్ల కిందట బీటెక్ పూర్తిచేసి హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో రెండు సంవత్సరాలు ఉద్యోగం చేసిన అనంతరం ఉద్యోగం నుంచి కంపెనీవారు తొలగించడంతో రెండేళ్లుగా ఉద్యోగం కోసం పలు విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నాడు. చివరకు ఉద్యోగం కోసం దళారులకు అడిగినంత నగదు చెల్లించుకున్నాడు. రోజులు, నెలలు గడుస్తున్నా దళారులకు ఇచ్చిన నగదు, ఉద్యోగం రాకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురై ఈ నెల 11వ తేదీ మధ్యాహ్న సమయంలో ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. ఉద్యోగం ఇక రాదని మనస్థాపానికి గురైన అఖిల్‌కుమార్ మంచికల్లు సమీపంలోని బుగ్గవాగులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు రెండు రోజులుగా పలు ప్రాంతాలలో గాలించిన ఏలాంటి ఆచూకీ లభించలేదు. బుగ్గవాగులో జాలర్లకు బుధవారం అఖిల్ కుమార్ మృతదేహం కనిపించడంతో వెలికితీసి పోలీసులకు సమాచారం ఇచ్చి అప్పగించారు. శవపంచనామా నిమిత్తం మృతదేహాన్ని గురజాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అఖిల్‌కుమార్ అవివాహితుడు. తండ్రి ఆంజనేయులు ఫిర్యాదు మేరకు పరిశీలిస్తున్నట్లు ఎస్ఐ సీహెచ్ నాగార్జున తెలిపారు.

బాలికా హక్కుల పరిరక్షణపై అవగాహన



బాలికా హక్కుల పరిరక్షణ పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

కారెంపూడి: బాలికా హక్కుల పరిరక్షణపై మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ఆడపిల్లలను బాగా చదివించుకుంటే వారు ఇంటికి వెలుగు అవుతారని ఆ కుటుంబం అన్నివిధాలా వృద్ధి అవుతుందని ఆడపిల్లల హక్కుల పరిరక్షణకు అందరూ ప్రాధాన్యతనివ్వాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమా కోరారు. బాల్య వివాహాలు జరిపించవద్దని వారికి కల్పించిన హక్కులకు భంగం వాటిల్లేలా ఎవరు ప్రవర్తించినా వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ప్రవర్తించినా చట్టపరంగా చర్యలుంటాయని న్యాయవాది వసంత అశోక్ పేర్కొన్నారు. పీహెచ్‌సీ డాక్టర్ మౌనిక మాట్లాడుతూ ఆడపిల్లల ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కౌన్సిలర్ సుప్రజ బాలికల హక్కులను వివరిస్తూ వాటి సంరక్షణకు అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు ప్రాధాన్యతనిచ్చి విస్తృతంగా ప్రచారం చేసి తల్లిదండ్రుల్లో చైతన్యం నింపాలని కోరారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

రెంటచింతల: స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి రాయపాటి రాజకిశోర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వారోత్సవాలలో పుస్తక ప్రదర్శన, మాదకద్రవ్యాలపై అవగాహన, పుస్తక పఠన ప్రాముఖ్యత వివరించడంతో పాటు విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, డిబెట్ పోటీలను నిర్వహించి బహుమతులను అందజేయడం జరుగుతుందన్నారు. మండల పరిధిలోని స్థానికులు, వివిధ పాఠశాలల విదార్థులు, ఉపాధ్యాయులు పాల్గొని గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

గురజాల రూరల్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. రెంటచింతల మండలం రెంటాల గ్రామానికి చెందిన కుర్రా కృష్ణా నాయక్ (31) రెంటాల నుంచి అంబాపురంకు కూలి పనుల నిమిత్తం రోజు కూలీలను తీసుకు వస్తుంటాడు. బుధవారం సాయంత్రం కూలీల డబ్బుల కోసం అంబాపురం వెళ్తుండగా గ్రామ సమీపంలో ముందుగా వెళ్తున్న ఎద్దులబండిని ద్విచక్రవాహనంతో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కృష్ణానాయక్ తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని సామాజిక ఆరోగ్య కేంద్రానికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సత్రశాలలో ప్రత్యేక పూజలు..హోమాలు



భ్రమరాంభికాదేవికి ప్రత్యేక పూజలు



ప్రధాన అర్చకుడు చిట్టేల శివశర్మ నేతృత్వంలో నిర్వహిస్తున్న హోమం

సత్రశాల(రెంటచింతల): మండలంలోని సత్రశాల వద్ద వేంచేసిన అతి పురాతనమైన శైవక్షేత్రమైన గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి దేవస్థానంలో కార్తికమాసం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు, హోమాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన అనేక ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు చిట్టేల శివశర్మ నేతృత్వంలో మల్లిఖార్జునస్వామివారికి, భ్రమరాంభికాదేవి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. ఏపీ జెన్‌కో ఇంజినీర్స్, కె.శ్రీనివాసరెడ్డి, ఎ.సతీష్‌కుమార్, మల్లేశ్వరి, ఎస్. అంజిరెడ్డి, ప్రశాంతి దంపతులు భక్తులకు, వివిధ స్వామిమాలలు స్వీకరించిన మాల దారులకు అన్నదానం చేయగా.. ఎండోమెంట్ ఈఓ గాదె రామిరెడ్డి, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వాటర్ క్యాన్లు వితరణ...

మండల పరిధిలోని సత్రశాల వద్ద వేంచేసిన అతి పురాతనమైన శైవక్షేత్రం శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి దేవస్థానానికి రెంటచింతలకు చెందిన గౌరు నాగేశ్వరరావు 20 వాటర్ వ్యాన్స్ అందచేసినట్లు ఈఓ గాదె రామిరెడ్డి బుధవారం తెలిపారు.

ఉపాధి నిధులతో అభివృద్ధి

శావల్యాపురం: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పథకం నిధులు ద్వారా గ్రామాభివృద్ధికి దోహదపడతాయని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. బుధవారం మండలంలోని వయ్యకల్లు, ముంద్రువారిపాలెం గ్రామపంచాయతీలో 2025–26 ఆర్థిక సంవత్సరంలో చేయాల్సిన ఉపాధి పనులకు సంబంధించి గ్రామసభలు నిర్వహించారు.

మాగాణి రైతులకు బీమా సౌకర్యం

యడ్లపాడు: ఈ ఏడాది రబీ సీజన్‌లో మాగాణి సాగు చేస్తున్న రైతులు పీఎం ఎఫ్‌బీవై పథకం కింద బీమా చేసుకునే సదుపాయం ఉందని జిల్లా వనరుల కేంద్రం ఏవో పి.ప్రవీణ్ పేర్కొన్నారు. వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో బుధవారం కొండవీడు, చెంఘీజ్‌ఖాన్ పేట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికపై ఒక రోజు శిక్షణ

బొల్లాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ శిక్షణలో భాగంగా గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, గ్రామసభల నిర్వహణ, తీర్మానాలు రూపొందించడం, ప్రజల భాగస్వామ్యంతో గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడం వంటి అంశాలను శిక్షణలో వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎంపీపీ బత్తి రాములు మాట్లాడుతూ గ్రామపంచాయతీల అభివృద్ధి దిశగా గ్రామపరిపాలన సాగించాలని పంచాయతీల పరిపాలన, గ్రామాల పరిపుష్టికి దోహదపడాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో కె.ప్రభాకరరావు, శిక్షకులుగా పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనుబాబు, బి.సురేష్, కె.శ్రీను వ్యవహరించారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

16 నాటికి గోకుల షెడ్లు ప్రారంభించాలి



పట్టుపురుగుల కేంద్రాన్ని పరిశీలిస్తున్న సిద్ధా లింగమూర్తి

యడ్లపాడు:జిల్లాలోని నిర్మాణంలో ఉన్న గోకుల షెడ్లు ఈనెల 16వ తేదీలోగా ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.సిద్ధాలింగమూర్తి చెప్పారు. బుధవారం ఆయన యడ్లపాడు మండలాన్ని సందర్శించారు. మండలంలోని సొలస, చెంఘీజ్‌ఖాన్‌పేట, కొత్తపాలెం, యడ్లపాడు గ్రామాలలో ఉపాధి హామీ పథకం అధికారులతో కలిసి పర్యటించారు. సొలస గ్రామ పంచాయతీలో నిర్మాణంలో ఉన్న గోకుల షెడ్డు నిర్మాణ పనుల్ని, పట్టుపురుగుల పెంపక కేంద్రాన్ని, కొత్తపాలెంలో సేద్యపుకుంట పనుల్ని, యడ్లపాడులోని రూఫ్ హార్వేస్టింగ్ స్ట్రక్చర్ పనుల్ని పరిశీలించారు. అనంతరం యడ్లపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. అన్ని గ్రామ పంచాయతీల్లో సిటిజన్ ఇన్ఫర్మేషన్ బోర్డులను ఏర్పాటు చేయాలని, అలాగే ఎఫ్ఏలకు నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి హేమలతాదేవి, టీపీ మాధవి, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు సర్టిఫికేషన్ చేయించుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీపీఎం అమలకుమారి

డీపీఎం కె.అమలకుమారి

నరసరావుపేట రూరల్: ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ప్రతి రైతు సర్టిఫికేషన్ చేయించుకోవాలని డీపీఎం కె.అమలకుమారి తెలిపారు. అంజిరెడ్డి మీటింగ్ హాల్లో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి మూడవ రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమలకుమారి మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది 32,513 మంది రైతులు 42,113 ఎకరాల్లో 30 రకాల విత్తనాలు (పీఎండీఎస్) వేయడం జరిగిందన్నారు. ఆయా రైతులు ప్రస్తుతం ప్రధాన పంటలైన వరి, మిరప, కంది, కూరగాయలు సాగు చేస్తున్నారని తెలి పారు. రైతులు పండించిన పంటలను భాగ స్వామ్య హామీ విధానం(పీజీఎస్)లో గ్రూపులుగా చేస్తున్నట్టు చెప్పారు. ఈ గ్రూపులుగా ఏర్పడేందుకు రైతులు ఎటువంటి ప్రకృతి వ్యవసాయ విధానాలు ఆచరించాలో సిబ్బందికి తెలియజేశారు. రైతులు ఈ సర్టిఫికేషన్ చేయడం ద్వారా తాము పండించిన ఉత్పత్తులకు మార్కెట్ ధర కన్నా 15శాతం అధిక ధర లభిస్తుందని తెలిపారు. జిల్లాలోని రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాలు ఆచరించాలని సూచించారు. దీని ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయాన్ని రైతులు పొందవచ్చని తెలిపారు. అంతేకాకుండా వినియోగదారులకు పోషకాలతో కూడిన ఆహార పదార్థాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం ప్రేమ్‌రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక వికాసం

శావల్యాపురం: క్రీడలు మానసిక వికాసంతో పాటు శారీరక దృఢత్వానికి దోహదపడతాయని శావల్యాపురం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం బి.విజయలక్ష్మి అన్నారు. బుధవారం పాఠశాలలో స్కూల్ గేమ్స్ విభాగం బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీల్లో మంచి ప్రతిభ చూపిన అండర్-14 బాలికల జట్టు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీల్లో అన్నమయ్య జిల్లా కనుమలచెర్వు పోటీల్లో జరిగినట్లు తెలిపారు. ఈ పోటీల్లో యు.లలిత (9వ తరగతి) ఎ.జ్యోతిక (8వ తరగతి) సి.హెచ్.హర్షిత (9వ తరగతి)లు ఎంపికైనట్లు తెలిపారు.

సీసీఐ ద్వారా పత్తికి మద్దతు ధర

యడ్లపాడు: మండలంలోని పత్తి సాగు చేసిన రైతులు సీసీఐ ద్వారా తమ దిగుబడుల్ని మద్దతు ధరకు విక్రయించుకోవాలని మండల వ్యవసా య అధికారి సీహెచ్ సరిత తెలిపారు. బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ సీసీఐ కేంద్రంలో పత్తి దిగుబడుల్ని విక్రయించే రైతులు ముందుగా తమ సమీపంలోని రైతు సేవా కేంద్రంలో ఈ- క్రాప్, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఆ తర్వాతనే తమ పత్తిని పూర్తిగా ఆరబెట్టి గోనెసంచుల్లో లేదా లూజుగా కేంద్రానికి తీసుకు వెళ్లాలన్నారు. ప్లాస్టిక్‌గోతాల్లో మాత్రం పత్తిని కేంద్రానికి తీసుకెళ్లరాదని చెప్పారు. 8శాతం తేమ ఉన్న పత్తికి క్వింటాకు రూ.7120 చొప్పున మద్దతు ధర లభిస్తుందన్నారు. అలాగే ప్రస్తుతం సాగులో ఉన్న పత్తిపంట గులాబీ రంగు పురుగు ఆశించకుండా తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు వివరించారు. తక్కువ మోతాదులో పురుగుల మందును వినియోగించుకోవాలని సూచించారు. రబీలో శనగ సాగు చేసుకునే రైతులకు సబ్సిడీపై టివిరిడిని వినియోగించుకుని విత్తనశుద్ధి చేసుకోవడం ద్వారా వేరుకుళ్లు, ఎండు తెగులును నివారించు కోవచ్చన్నారు.

కోర్టులో ఒకరికి బదులు మరొకరు సాక్ష్యం

- వన్‌టౌన్‌లో కేసు నమోదు
- నిందితుడు అరెస్ట్

నరసరావుపేటటౌన్: న్యాయస్థానంలో ఒకరికి బదులు మరొకరు సాక్ష్యం చెప్పిన సంఘటనపై కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు వన్ టౌన్ సీఐ విజయ్‌చరణ్ బుధవారం తెలిపారు. సివిల్ కేసులో ఒకరికి బదులు మరొకరు సాక్ష్యం చెప్పి కోర్టును తప్పుదోవ పట్టించేవిధంగా ప్రవర్తించారని 13వ అదనపు జిల్లా కోర్టు చీఫ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ తాడికొండ సింహాచలం వన్‌టౌన్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. కాసా మల్లిఖార్జునరావు స్థానంలో సాక్ష్యం చెప్పేందుకు వెళ్లిన డి.కొండ సాంబశివరావుపై కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలు

నరసరావుపేటటౌన్: చెల్లని చెక్కు కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష, రూ.1000 జరిమాన విధిస్తూ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి ఆర్.ఆశీర్వాదం పాల్ బుధవారం తీర్పు చెప్పారు. పట్టణానికి చెందిన భరత్ వద్ద హైదరాబాద్‌కు చెందిన కళా వెంకట నాగేశ్వరరావు 2017 మార్చి 14న రూ.8 లక్షలు నగదు అప్పుగా తీసుకున్నాడు. చెల్లింపులో భాగంగా చెక్కు అందజేశాడు. ఖాతాలో నగదు లేకపోవటంతో బాధితుడు కోర్టును ఆశ్రయించాడు. నేరం రుజువు కావటంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.